

శనివారం చెన్నైలో తెలంగాణ మాజీ గవర్నర్ నరసింహన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న మాజీ మంత్రి కెటిఆర్ తదితరులు

## చెన్నైలో మాజీ గవర్నర్ నరసింహన్‌తో మాజీ మంత్రి కెటిఆర్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మార్చి 22:** తమిళనాడు రాజధాని చెన్నైలో పర్యటించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కల్వకుంట్ల తారాక రామారావు... శనివారం తెలంగాణ మాజీ గవర్నర్ నరసింహన్ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా నరసింహన్ దంపతులను కేటీఆర్ శాలువాతో సత్కరించారు. అనంతరం వారి యోగక్షేమాలను కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. కేటీఆర్‌తో పాటు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎంపీ వినోద్ కుమార్ ఉన్నారు.

## దావత్ ఏ ఇఫ్తార్ ఘనంగా నిర్వహించండి

### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మార్చి 22:** దావత్ ఏ ఇఫ్తార్ ను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శనివారం అసెంబ్లీ సమావేశ మందిరంలో ఇఫ్తార్ విందు, రంజాన్ పండుగ ఏర్పాట్లను ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి సమీక్షించారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా నిర్వహించే ఈ కార్యక్రమాలకు ఎలాంటి నిధుల కొరత లేదు అని డిప్యూటీ సీఎం తెలిపారు. ఆహారంలో నాణ్యత, ప్రోటోకాల్, సౌకర్యాల కల్పనలో అధికారులు ఎలాంటి రాజీ పడాల్సిన అవసరం లేదని డిప్యూటీ సీఎం తెలిపారు. ఏర్పాట్లలో అధికారులు ఏమాత్రం అశ్రద్ధ వహించరాదని, చిన్న పొరపాటుకు అవకాశం లేకుండా చూడాలని డిప్యూటీ సీఎం తెలిపారు.

## ధర్మం గెలిచే వరకు పోరాటం ఆగదు

### సిఎం రేవంత్‌రెడ్డి ఆసక్తికర ట్వీట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మార్చి 22:** ఈ ధర్మ పోరాటానికి చెన్నై శ్రీకారం చుట్టింది.. ఇక హైదరాబాద్ ఆకారం ఇస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. కేంద్రం తీసుకొస్తానంటున్న డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా చెన్నైలో జరిగిన అఖిలపక్ష సమావేశానికి హాజరైన ముఖమంత్రి రేవంత్‌రెడ్డి తమిళనాడు స్టాలిన్ పోరాటానికి మద్దతు పలికారు. ఈ సమావేశంపై ట్విట్టర్ వేదికగా స్పందించిన సిఎం పలు కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయం జరిగే వరకు, ధర్మం గెలిచే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. 'ఈ పుణ్యభూమి .. తూర్పు నుండి పడమర వరకు.. ఈ ధన్యభూమి .. ఉత్తరం నుండి దక్షిణం వరకు.. అంబేద్కర్ మహనీయుడు రాసిన రాజ్యాంగం వల్ల సమాఖ్య స్ఫూర్తిని.. సామాజిక న్యాయాన్ని, సమాన హక్కులను పొందింది. ఈ స్ఫూర్తిని, న్యాయాన్ని, హక్కులను.. కేవలం రాజ్య విస్తరణ కాంక్షతో.. రాజకీయ ప్రయోజన ఆకాంక్షతో.. డీలిమిటేషన్‌ను అస్త్రంగా ప్రయోగించి.. విచ్ఛిన్నం చేస్తామంటే మౌనంగా ఉండలేం. ఉత్తరాదిని గౌరవిస్తాం.. దక్షిణాది హక్కుల విషయంలో రాజీ పడం. అది డీలిమిటేషన్ ఐనా.. విద్యా వ్యవస్థపై పెత్తనమైనా.. అంగీ కరించేది లేదు' అని స్పష్టం చేశారు.

## ప్రతి నియోజకవర్గానికి మినీఇండస్ట్రియల్‌పార్కు

### పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, మార్చి22,ప్రభాతవార్త:** తెలంగాణలో పారిశ్రామిక ప్రగతి వేగవంతం చేయడానికి 119 నియోజకవర్గాలలో మిని ఇండస్ట్రియల్ పార్కులను ,వికారాబాద్ జిల్లా ఎంకతల వద్ద ఎల్రక్టిక్ వెహికల్ వ్యాలీహబ్ ఏర్పాటు చేయబోతున్నామని పరిశ్రమలు,ఐటిశాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు తెలిపారు. అసెంబ్లీలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు,కసిరెడ్డినారయణరెడ్డి ప్రశ్నకు సమాధానం చెబుతూ ట్రిలియన్ డాలర్ పరిమాణం కలిగిన ఆర్థికవ్యవస్థ రూపొందించడం కోసం ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి అకాడమి ఏర్పాటు చేస్తామనిఆయన అన్నారు. ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలను తయారించడానికి రాష్ట్రస్థాయిలో ముఖ్యంగా ఒంటరి మహిళలను ఆర్థిక శక్తులుగా రూపొందించడానికి చర్యలు చేపడుతామని అన్నారు.గత ప్రభుత్వంకు పారిశ్రామిక విధానంలేదని మేం సూక్ష్మ,చిన్న,మధ్య,భారీపరిశ్రమలు ఏర్పాటుకు ప్రత్యేకంగా విధానం రూపొందిస్తున్నామని అన్నారు.

## ఎస్ఎల్‌బిసి సహాయక కార్యక్రమాలకు రూ.5 కోట్లు మంజూరు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మార్చి 22:** నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఎస్ఎల్‌బిసి వద్ద గత నెల 22న జరిగిన ప్రమాదం నేపథ్యంలో సహాయక చర్యలను కొనసాగించేందుకు ప్రభుత్వం రూ.5కోట్లను మంజూరు చేసింది. ఈ మేరకు రెవెన్యూ (డిజాస్టర్ మేనేజ్‌మెంట్) విభాగం ప్రత్యేక ఉత్తర్వులను జారీ చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ అభ్యర్థనను పరిశీలించిన అనంతరం ఆర్థిక విభాగం ఈ నిధులను మంజూరు చేయాలని ప్రభుత్వం సూచించింది. నిధులను సమర్థంగా వినియోగించి సహాయక చర్యలను వేగవంతం చేయాలని కలెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

## జైలు నుంచి పోసాని విడుదల

**విజయవాడ,మార్చి22,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, డీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ల మీదవారు విపక్షంలో ఉన్నప్పుడు అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో పోసాని కృష్ణ మురళి అరెస్ట్ అయ్యారు, గత కొన్ని రోజుల నుంచి ఆయన గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. నిన్న ఆయనకు గుంటూరులోని సీఐడీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో శనివారం ఆయన జైలు నుంచి విడుదల అయ్యారు. వైసీపీ నేత అంబటి రాంబాబు జైలు వద్దకు వెళ్లారు. జైలు నుంచి బయటకు వచ్చిన పోసానికి స్వాగతం పలికారు. ఆ తర్వాత పోసాని తన కుటుంబసభ్యులతో కలిసి కారులో అక్కడినుంచి వెళ్లిపోయారు. కాగా, మార్చి 23వ తేదీ వరకు పోసాని



రిమాండ్‌లో ఉండాల్సి ఉంది. సీఐడీ అధికారులు ఒక రోజు ఆయన్ని కస్టడీలోకి తీసుకుని విచారించారు. మరోసారి తమకు విచారణ నిమిత్తం అప్పగించాలని కోర్టును కోరారు. కానీ, ఈ లోపే సీఐడీ కోర్టు ఆయనకు బెయిల్ ఇచ్చింది. రూ. లక్ష చొప్పున ఇద్దరు వ్యక్తుల తోపాటు సొంత పూచీకత్తు సమర్పించాలని ఆదేశించింది. చార్జిషీటు దాఖలు చేసేవరకు గుంటూరు సీఐడీ రీజినల్ ఆఫీసులో రెండు వారాల కోసారి హాజరు కావాలని షరతు పెట్టింది. పోలీసులు పిలిచినప్పుడు వచ్చి విచారణకు సహకరించాలని ఆదేశించింది. అయితే, పోసానిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వ్యాప్తంగా చాలా చోట్ల కేసులు నమోదు అయి ఉన్నాయి. బెయిల్ మంజూరు అయిన తర్వాత కూడా ఆయన విడుదలపై ఉత్కంఠ నెలకొని ఉండింది. కోర్టు బెయిల్ మంజూరు చేసినా.. ఏ జిల్లా నుంచి అయినా పోలీసులు వచ్చి పీటీ వారెంట్‌తో పోసానిని మరోసారి అదుపులోకి తీసుకుంటారా? అనే సందిగ్ధతకు ఏర్పడింది. ఈ క్రమంలో పోసాని విడుదలయ్యారు.

# ఎంపి సీట్లు అలా ఉంచి అసెంబ్లీ సీట్లు పెంచాలి

### డీలిమిటేషన్‌తో దక్షిణాది భవిష్యత్తుకు పెనుప్రమాదం

### చెన్నై సదస్సులో కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 22:** డీలిమిటేషన్ వలన దక్షిణాదికి తీవ్ర నష్టం జరునుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు. ఇది కేవలం పార్లమెంటులో ప్రాతినిధ్యానికి సంబంధించిన అంశం మాత్రమే కాదు. నిధులు కేంద్రీకృతం కావడంతో పాటు.. ఆర్థిక నియంతృత్వానికి దారి తీస్తుందని.. దక్షిణాది భవిష్యత్తును కాలరాస్తుందని కేటీఆర్ వివరించారు. దేశం ప్రజాస్వామిక దేశమైనా.. భిన్న అస్తిత్వాలు, సంస్కృతులు కలిగిన ఒక సమాఖ్య రాష్ట్రం అన్న విషయాన్ని కేటీఆర్ గుర్తుంచుకోవాలన్నారు. శనివారం చెన్నైలో జరిగిన డీలిమిటేషన్ సదస్సులో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. కేవలం జనాభా ఆధారంగా సీట్ల పెరుగుదల గనుక జరిగితే దేశ సమాఖ్య స్ఫూర్తికి తీవ్ర విఘాతం కలిగే ప్రమాదం ఉన్నది అని కేటీఆర్ అన్నారు. మనమందరం భారతీయులం..అయితే మనందరికీ ఆయా ప్రాంతాల అస్తిత్వం ఉందన్న విషయాన్ని మర్చిపోవద్దు. విభిన్న భాషలు సాంస్కృతిక అస్తిత్వాలతో కూడిన ఒక సమైక్య దేశం అన్న విషయాన్ని మర్చిపోకూడదు అని కేటీఆర్ సూచించారు. మెజార్టీ నియంతృత్వం మందబలం ఉన్నప్పుడు జరిగే నష్టాలు మా తెలంగాణ ప్రజలకు తెలుసు అని చెప్పారు. తెలంగాణ ఉద్యమ కాలంలో ఢిల్లీలో ఉన్న మందబలంతో పాటు సమైక్య రాష్ట్రంలోని మెజార్టీ నాయకత్వం పైన పోరాటం చేసి 14 సంవత్సరాల అనంతరం తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చుకున్నామన్నారు. తమిళనాడు ప్రజల నుంచి అనేక అంశాలు స్ఫూర్తి తీసుకుంటామని పేర్కొన్నారు. అస్తిత్వం కోసం,హక్కుల కోసం కొట్లాడడంలో తమిళనాడు స్ఫూర్తినిచ్చిందని, ద్రవిడ ఉద్యమం సమైక్య దేశంలో తమ హక్కులు సాధించుకోవడానికి రాష్ట్రాలకు ఒక దిక్సూచి లెక్క పనిచేస్తుంది అని కేటీఆర్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రస్తుత డిలిమిటేషన్ వల్ల అనేక నష్టాలు జరుగుతున్నాయని, ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ వివక్షపూరిత విధానాల వలన దక్షిణాదికి అనేక నష్టాలు జరుగుతున్నాయని చెప్పారు. దేశ అభివృద్ధి కోసం పని చేసినందువలన ఈరోజు నష్టం జరుగుతుందని, మనమంతా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నామన్నారు. ప్రజాస్వామ్యం మందబలం ఆధారంగా నడవరాదు. మందబలం ఉన్నందువలన నియంతృత్వం రావద్దు. దేశ అభివృద్ధిలో ముందు వరుసలో ఉన్న రాష్ట్రాలకు నష్టం కలిగిస్తూ.. దేశాన్ని వెనక్కి నడుస్తున్న రాష్ట్రాలకి ఈ డిలిమిటేషన్ విధానం లాభం చేకూరుస్తుందని పేర్కొన్నారు.

ఆర్థికపరమైన నిధుల కేటాయింపుల్లో కూడా తీవ్రమైన నష్టం జరగబోతుంది. వీటి కేటాయింపుల్లో కూడా అధికారం పూర్తిగా కేంద్రీకృతమై నియంతృత్వం వైపు దారితీసే అవకాశం ఉన్నది. ఆర్థిక వనరుల కేంద్రీకృతం జరగడం వలన భవిష్యత్తులోనూ ప్రస్తుతం ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న నిధుల కేటాయింపులు అన్యాయం మరింతగా పెరుగుతుందన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వ వివక్ష కొత్త కాదు. కానీ ఈ మధ్యకాలంలో ఈ వివక్ష అన్యాయం మరింత పెరిగింది అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రస్తుతం బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం దీన్ని మరింత పెంచేలా డీ లిమిటేషన్ అంశాన్ని ముందుకు తీసుకువచ్చింది. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన బుల్లెట్ రైలు వంటి ప్రాజెక్టులన్ని ఉత్తరాదికే పరిమితం అవ్వడం ఇందుకు ఒక ఉదాహరణ అని చెప్పారు. బీజేపీ సారథ్యంలోని కేంద్రం ఈ విధంగా దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయం పైన పుండుపైన ఉప్పురుద్దినట్టుగా వ్యవహరిస్తున్నది. ఆదర్శవంతమైన సమైక్య రాష్ట్ర దేశంలో ఒక ప్రాంతం ఇంకో ప్రాంతం పైన ఆధిపత్యం చలాయించే విధంగా ఉండరాదన్నది ప్రజాస్వామ్యస్ఫూర్తి . ఇది కేవలం ఉత్తర దక్షిణాది రాష్ట్రాల వ్యవహారం కాదు అభివృద్ధి చెందిన రాష్ట్రాలు



ప్రాంతాలకు నష్టం జరుగుతున్న అంశం అని కేటీఆర్ పేర్కొన్నారు. వెనుకబడిన రాష్ట్రాలకు నిధులు ఇచ్చే అంశాన్ని మేము ఏమి వ్యతిరేకించడం లేదు కానీ.. నిధుల కేటాయింపుల వివక్షను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం.ప్రస్తుత బిజెపి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా పునర్విభజన చట్టంలో ఇచ్చిన డీలిమిటేషన్ హామీలను నిర్లక్ష్యం చేసిందని కెటిఆర్ ఆరోపించారు.బిజెపి ప్రయోజనాల కోసం తెలంగాణ,ఆంధ్ర రాష్ట్రాల్లో డీలిమిటేషన్ చేయకపోగా జమ్మూ కాశ్మీర్‌లో మాత్రం అమలు చేసిందని విమర్శించారు. బిజెపి వంటి పార్టీలు ఈ సమావేశాన్ని దేశ వ్యతిరేకంగా చూపే ప్రయత్నం చేసినా మేమంతా భారతీయులం,దేశ అభివృద్ధి కోసం పనిచేస్తున్నాం అని కెటిఆర్ గుర్తు చేశారు.

# కాంగ్రెస్, బిఆర్ఎస్ ఒకటే అని తేలింది..

### పునర్విభజన విధివిధానాలే ఇంకా ఖరారు కాలేదు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపి డాక్టర్ కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ పావనీ వినయకుమార్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), మార్చి 22, ప్రభాతవార్త:** ఇవాళ చెన్నైలో నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీని వ్యతిరేకించే పక్షాలు కాంగ్రెస్, బీఆర్ఎస్, డీఎంకే, కమ్యూనిస్టులు సమావేశమవడం పై కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. శనివారం సాయంత్రం నగరంలోని ముషీరాబాద్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయ కుమార్‌తో కలిసి ప్రారంభించిన అనంతరం మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ పై విధంగా స్పందించారు. ఆయా పార్టీల కలయిక ఆలు లేదు చూలు లేదు కొడుకు పేరు సోమలింగం అన్న చందంగా ఉందని అన్నారు. అసలు నియోజక వర్గాల పునర్విభజనకు అనుసరించాల్సిన విధి విధానాలు ఖరారు కానే కాలేదు. నియమ నిబంధనలు రూపొం దించనే లేదు, కానీ దక్షిణాదికి అన్యా యం జరుగుతుం దంటూ ఈ పార్టీలు ప్రజల్లో అపో హలు సృష్టించే ప్రయ త్నం వారి దిగజారు డుతనానికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. పైకి నియోజకవర్గాల పునర్విభజన అని చెప్తున్న ప్పటికీ, వాస్తవానికి వారి ఎజెండా బీజేపీపై విషం కక్కడమేనేది స్పష్టమవుతోందని, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లో గ్యారెంటీల హామీల అమలు వైఫల్యాలతో కాంగ్రెస్, తమిళనాడులో అవినీతి కుటుంబ పాలనతో డీఎంకే తీవ్రమైన ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్నాయన్నారు.

అటు బీఆర్ఎస్ అధికారం కోల్పోయి గత పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటూ గెలవలేకపోయింది. ఇటీవలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో కనీసం పోటీ చేసే ధైర్యం కూడా చేయలేదని, ఈ నేపథ్యంలో ప్రజల దృష్టి మళ్లించి, భావోద్వేగాలు రెచ్చగొట్టేందుకు ఉత్తరాది, దక్షిణాది అంటూ విభజన తీసుకువచ్చేందుకు కుట్రలు పన్నుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎన్డీఏ పక్షాలు అధికారంలో ఉన్నాయని, బీజేపీ రోజురోజుకు విస్తరిస్తూ ఉంటే, కుచించుకుపోతుందని, నేడు కేవలం కాంగ్రెస్ పార్టీ 3 రాష్ట్రాల్లోనే అధికారానికి పరిమితమైందని, దీంతో ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో వివిధ ఏజెండాలతో సమాజంలో అస్థిరత సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని ఆయన తెలిపారు. అంతేకాకుండా.." 2016లో జెఎన్‌యు తుగ్రే తుక్డే గ్యాంగ్‌ను ముందుపెట్టి విభజన తీసుకొచ్చేందుకు ప్రయత్నించి విఫలమైందని, తర్వాత బీజేపీ రాజ్యాంగాన్ని మారుస్తుందంటూ, రిజర్వేషన్లు రద్దు చేస్తుందంటూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నం చేసిందని, . అవేవీ పారకపోవడంతో ఇప్పుడు డీలిమిటేషన్ కింద దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందంటూ కాంగ్రెస్ సరికొత్త కుట్రలకు తెరలేసింది. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ను ముందు పెట్టి ఉత్తరదక్షిణ భారతదేశం మధ్య విభజన తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోం దన్నారు. తమిళనాడులో అధికార పార్టీ డీఎంకే, ముఖ్యమంత్రి స్టాలిన్ కుటుంబపాలనపై తీవ్ర వ్యతిరేకత ఉందని, రూ.700 కోట్ల లిక్కర్ కుంభకోణం సహా వరుసగా స్కాములు బయటపడడం, ఆ వ్యతిరేకతను మరింత పెంచుతున్నాయని, ప్రజల మధ్య భావోద్వేగాన్ని రెచ్చగొట్టేందుకు జాతీయ విద్యావిధానంలో త్రిభాషా సూత్రాన్ని చూపి, హిందీని బలవంతాన రుద్దుతున్నారని తప్పుడు కథనాన్ని తీసుకొచ్చారన్నారు.

## అసెంబ్లీ మీడియా పాయింట్

### రుణమాఫీ చేసేవరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టం : మాజీమంత్రి హారీశ్‌రావు



**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ పార్టీ రుణ మాఫీ అబద్దం బట్ట బయలైందని రైతులను ఆశచూపి ఓట్లు వేయించుకొని అధికారం లోకి వచ్చారని రేవంత్ రెడ్డి దేవుళ్లపై ఒట్లు పెట్టీ మాట తప్పారని మాజీ మంత్రి బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు మండిపడ్డారు. ఈమేరకు శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ 'లక్షలాది మంది రైతులకు రుణ మాఫీ కాలేదు. కాంగ్రెస్ వాళ్ల చెపుతున్నది 21 వేల కోట్ల రూపాయలు, చేసింది సుమారు 15 వేల కోట్ల రూపాయలు మాత్రమే. ఈ ప్రభుత్వాన్ని యెట్టి పరిస్థితిలో వదిలిపెట్టం. రెండు లక్షల రూపాయలపైన ఉన్న రైతుల రుణ మాఫీ కూడా చేయాల్సిందే. రైతు సోదరులారా... కాంగ్రెస్ పార్టీ నాయకులను, రేవంత్ రెడ్డిని ఎక్కడిక్కడ నిలదీయండి. అసెంబ్లీలో,బయట మేము ఎక్కడిక్కడ నిలదీస్తాం. రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవా? పాలమూరు బిడ్డవి అయితే, పౌరుషం ఉంటే రుణ మాఫీ చేయి. దేవుడి శాపం, పాపం తగులుతుంది' అని హారీశ్‌రావు పేర్కొన్నారు.

**అసెంబ్లీకి రాకుండా ఫాంహౌస్‌లో పగటి కలలు ప్రతిపక్ష నేత కెసిఆర్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఫైర్**

ప్రతిపక్షనేత కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి ప్రజాసమస్యలపై చర్చించకుండా ఫామ్‌హౌస్‌లో ఉండి కలలు కంటున్నాడని పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఈమేరకు శనివారం అసెంబ్లీమీడియా పాయింట్ వద్ద విప్‌లు ఆదిశ్రీనివాస్,అడ్లూరి లక్ష్మణ్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌లు మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ " పదేళ్ళలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన కెసిఆర్ ప్రతిపక్ష పాత్ర పోషించకుండా ఇంకా పగటికలలు కంటున్నాడు. బీజేపీతో కలిసి వచ్చిన మీరు మళ్లీ అధికారంలోకి రారు. మళ్ళీ వచ్చేది ప్రజా ప్రభుత్వమే.

**మాట్లాడుతుంటే మైక్ కట్ చేస్తున్నారు : బిజెపి ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ**



తన నియోజకవర్గంలోని సమస్యలపై ప్రశ్నిస్తే మైక్ కట్ చేస్తున్నారని నిజామా బాద్ అర్బన్ ఎమ్మెల్యే దన్‌పాల్ సూర్య నారా యణ అన్నారు. ఈమేరకు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ 'నా నియో జకర్గంలో ఖిల్లా రామాల యం శిథిలావస్థకు చేరింది. దాన్ని మొఘలులు, నిజాములు జైలుగా మార్చారు. ఇది చరిత్ర.ఇరువై కోట్ల రూపాయలు విడుదల చేస్తే అది అభివృద్ధి అవుతుంది. గత చరిత్ర చెపుతుంటే నా మైక్ కట్ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ వాళ్ళు ఏమన్నా నిజాం వారసులా? వెంటనే ఖిల్లా రామాలయంను అభివృద్ధి చేసి, టూరిజం డెవలప్మెంట్ చేయాలి. స్పీకర్ నేను ఈ మాట మాట్లాడితే నా గొంతు నొక్కే ప్రయత్నం చేశారు"అని సూర్యనారాయణ పేర్కొన్నారు.

# ఫీజురీయింబర్స్‌పై దద్దరిల్లిన అసెంబ్లీ

### రైతు రుణమాఫీతో రీయింబర్స్‌లో స్వల్ప జాప్యం: మంత్రి సీతక్క

### ఎప్పట్లోగా చెల్లిస్తారో చెప్పండి : కూనంనేని

**హైదరబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయలపై సిపిఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు వేసిన ప్రశ్న శనివారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో మహిళా శిశుసంక్షేమం పంచాయతీరాజ్ మంత్రి సీతక్క, మాజీ మంత్రి హరీష్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లారాజేశ్వర్‌రెడ్డి మధ్యవాగ్వాదంకు తెరలేపింది. పెద్దనోట్ల రుద్ద,కోవిడ్ మహమ్మారి వంటి విపత్తులు వచ్చినా మా ప్రభుత్వం రూ. 20వేల కోట్ల ఫీజు రియింబర్స్‌మెంట్ చేసిందని హరీష్ రావు సభకు తెలిపారు. రైతురుణమాఫీని ఏకమొత్తం రెండులక్షలవరకు చేయడం వల్ల రూ.21వేల కోట్లు భారీ ఖర్చుచేయడం వల్ల ఫీజురియింబర్స్‌మెంట్ చెల్లింపులపై ప్రభావం చూపుతోందని ఐనా మేం 2022-23 విద్యాసంవత్సరానికి సంబంధించి 1438.62కోట్ల రూపాయలు 2023-24 సంవత్సరానికి సబంధించి 950.04 కోట్ల రూపాయలు చెల్లించామని,మరో 12వందల కోట్లరూపాయల టోకెన్లు కూడా సిద్దంగా ఉన్నాయని సీతక్క చెప్పుకొచ్చింది. గత ప్రభుత్వం ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టడంతోనే 5520.60కోట్ల రూపాయల చెల్లింపు జాప్యం జరిగిందని పంచాయతీరాజ్ మహిళాశిశు సంక్షేమశాఖ మంత్రి విమర్శలు చేయడంతో మాజీ మంత్రి హరీష్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లారాజ్వేర్‌రెడ్డిలు అడ్డుపడి "పాలకుల అశక్తతను గత ప్రభుత్వం" అంటూ కప్పిపుచ్చుకోవడం తగదని అభ్యంతరం వ్యక్తంచేశారు. మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ ఏపార్టీ పాలకులైనా ప్రభుత్వం అనేది నిరంతర ప్రక్రియ 2014లో మీరు కూడా రెండువేల కోట్ల రూపాయలు బకాయిలు పెట్టిపోయారని గుర్తుచేశారు. ఆనాటి మా ముఖ్యమంత్రి రెండువేల బకాయిలు చెల్లించకుండా నిందించలేదని ఆయన గురు చేశారు.

వెంటనే సీతక్క కలుగచేసుకొని మంచైతే మాది అని చెప్పకొంటారు చెడైతే మీదంటారని వ్యాఖ్యానించడంతో వాగ్వాదం కొంతసేపు హరీష్,పల్లారాజేశ్వర్‌రెడ్డితో నడిచింది. సీతక్క, హరీష్‌రావు గతం వర్తమానం తవ్వుకొని బకాయిల పెంకులు లెక్కించుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం రూ. 7800కోట్ల ఫీజు రియింబర్సు మెంట్ చెల్లించకపోవడంతో జూనియర్,డిగ్రీ కళాశాలు మూతపడుతున్నాయని హరీష్‌రావు, పల్లారాజేశ్వర్‌రెడ్డి, విమర్శించారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఫీజ్ రియింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో పిల్లల సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని కనీసం ప్రభుత్వం వారి సర్టిఫికెట్లు ఇప్పించాలని కోరారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయిహరీష్ మాట్లాడతూ విద్యార్థుల ఫీజురియింబర్స్‌మెంట్ ఎప్పటిలోగా చెల్లిస్తారని స్పష్టత ఇవ్వాలని కోరారు. సీతక్క ఎప్పటిలాగే గత ప్రభుత్వవైఖరీ కారణంగా అంటూ చెప్పడంతో హరీష్‌రావు మా హాయాంలో ఎప్పటి బకాయిలు అప్పుడే ఇచ్చామని ఇది కేవలం మీ ప్రభుత్వ కాలంలో మాత్రమే 15నెలలుగా చెల్లింపులు జరపకపవడంతో ఏర్పడిన సంక్షోభం అని గట్టిగా వాదించారు.

సీతక్క మా ప్రభుత్వం 829కోట్లు రూపాయల ఫీజు రియింబర్స్‌మెంట్ చెల్లించిందని అంటున్నారని కానీ అది కేవలం సిఆర్ఎఫ్ నిధులు మాత్రమే అని సొంతగా ఈ ప్రభుత్వం నయా పైసాకూడా ఇవ్వలేదని హరీష్ రావు అన్నారు. సీతక్క సమాధానం ఇస్తూ మాప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి చెల్లించాల్సిన ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు కేవలం 1194కోట్లరూపాయలే అని బిఆర్ఎస్ పాలన మొత్తం రియింబర్స్‌మెంట్ బకాయిలు 4312 కోట్లరూపాయలు విద్యాసంస్థలకు చెల్లించాల్సి ఉందని ఆమె తెలిపారు.

# తొలిమ్యాచ్ సొంతం చేసుకున్న రాయల్ ఛాలెంజర్స్

### ఏడు వికెట్ల తేడాతో ఓటమి పాలయిన డిఫెండింగ్ ఛాంపియన్ జట్టు కెకెఆర్

**కోల్‌కతా, మార్చి 22:** ఐపిఎల్ 2025లో రాయల్‌ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) బోణీ కొట్టింది. తొలిమ్యాచ్‌లోనే కోల్‌కత్తా నైట్‌రైడర్స్ జట్టును తమ సొంత మైదానం ఈడెన్‌గార్డెన్స్‌లోనే బోల్తాకొట్టించింది. ఆల్‌రౌండ్‌ప్రదర్శనలతో అదర గొట్టి పాయింట్ల పట్టికలో ఖాతా తెరిచింది. 18వ ఎడిషన్‌లో తొలి విజయం సాధించినజట్టుగా ఆర్సీబీ నిలిచింది. కెకెఆర్‌నిర్దేశించిన 175 పరుగుల లక్ష్యాన్ని మరో 22 బంతులు ఉండగానే మూడు వికెట్లు నష్టపోయి ఛేదించింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆర్సీబీ కెప్టెన్ రజత్‌పాటి దార్ తొలుత బౌలింగ్ ఎంపికచేసుకున్నాడు. ఓపెనర్ క్వింటన్‌డీకాక్(4) వికెట్ త్వరగానే కోల్పోయినా కెకెఆర్‌మాత్రం ఒకదశలో 9.5 ఓవర్లలో 107/1తో నిలిచింది. ఓపెనర్ సునీల్‌నరైన్ 26 బంతుల్లో 44 పరుగులు, అజింక్య రహనే 31 బంతుల్లో 56 పరుగులు చేయడంతో కోల్‌కత్తా భారీ స్కోరుపై కన్నేసింది. కానీ పుంజు కున్న ఆర్సీబీ బౌలర్లు వరుసవెంబడి వికెట్లు తీసారు. దీనితో ఆజట్టు అనుకున్న దానికంటే తక్కువ స్కోరుకే పరి మితం అయింది. నిర్ణీత 20 ఓవర్లలో కెకెఆర్ ఎనిమిది వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. ఆర్సీబీ బౌలర్ల లో కృనాల్ పాండ్యా అత్యధికంగా మూడు వికెట్లు తీసాడు. జోష్ హేజిల్‌వుడ్ 2, యశ్ దయాళ్, రసిక్ దార్ సలామ్, సుయాశ్ శర్మ ఒక్కోవికెట్ తీసారు. తర్వాత బ్యాటింగ్ ప్రారంభించిన ఆర్సీబీకి ఓపెనర్లు అదిరే ఆరంభం ఇచ్చారు.

విరాట్‌కోహ్లీ ఫిలిప్‌సాల్ట్‌లు 51 బంతు ల్లోనే 95 పరుగులుజోడించి జట్టు విజయానికి బాటలువేసారు. 31 బంతుల్లో 56 పరుగులు చేసిన తర్వాతసాల్ట్ ఔట్ అయినా కోహ్లీ మాత్రం చివరి వరకూ క్రీజులో ఉన్నాడు. మధ్యలో రజత్‌పాటిదార్ 16 బంతుల్లో 34పరుగులు చేసాడు. చివరకు ఆర్సీబీ 16.2 ఓవర్లలో మూడు



వికెట్లు కోల్పోయి లక్ష్యం సాధించి టోర్నీలో తొలివిజయం సాధించింది. విరాట్‌కోహ్లీ 36 బంతుల్లో 59 పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచాడు. ఈ విజయంతో రెండు పాయింట్లతో పాటు భారీగా నెట్‌రన్‌రేట్‌ను కూడా ఆర్సీబీ తన ఖాతాలో వేసుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగిన కేకెఆర్ తన సొంత గ్రౌండ్‌లోనే చిత్తుగా ఓడిపోయింది. 22 బాల్స్ మి గిలి ఉండగానే ఆర్సీబీ ఏడు వికెట్ల నష్టానికి 177 పరుగులుచేసి లక్ష్యాన్ని ఛేదించివిజేతగా నిలిచింది.

## రాష్ట్రంలో కొనసాగుతున్న వానలు, ఈదురుగాలులు

### వడగళ్ల ధాటికి నేలరాలిన వరిపైరు, మొక్కజొన్న

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మార్చి 22:** రాష్ట్రంలో శనివారం కూడా పలు జిల్లాల్లో వడగండ్ల వాన కురిసింది. కామారెడ్డి జిల్లాలో గాంధారి మండలం చద్మాల్ తండా,నేరల్ తండా,గుర్జాల్ గ్రామాల్లో జోరుగా వర్షం పడింది. వడగండ్ల వర్షం కారణంగా మొక్కజొన్న పంట పొలాల్లో నీరు చేరడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వికారాబాద్ నియోజకవర్గ పరిధిలోని మోమిన్‌పేట,నవాబుపేట మండలాల్లో వడగండ్ల వాన కురిసింది. దీనికి తోడు ఈదురుగాలు వీయడంతో నవపేట మండలం చిట్టిగద్ద గ్రామ సమీపంలో భారీ వృక్షం నేలకొరిగింది. కురిసిన అకాలవర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. కొన్ని ప్రాంతాల్లో వడగళ్ల వానతో పొట్టదశకు వచ్చిన వరిపైరు, మొక్కజొన్న పంటలు దెబ్బతినగా మామిడికాయలు రాలిపోయాయి. ప్రభుత్వం పంట నష్టం అంచనా వేసి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. శుక్రవారం పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసాయి. అష్టకష్టాలు పడి ఆరుగాలం శ్రమించి కాపాడుకున్న పంటలు వడగళ్ల వానతో రైతన్నకు కడగండ్లు మిగిల్చాయి.

## బెల్జియంలో సతీసమేతంగా మెహుల్‌చోక్సీ

**న్యూఢిల్లీ, మార్చి 27:** పంజాబ్‌నేషనల్ బ్యాంకును మోసగించిన కేసులోప్రధాన నిందితుడు వజ్రాలవ్యాపారి మెహుల్‌చోక్సీ విదేశాలకు పారిపోయిన సంగతి తెలిసిందే.ఆంటిగ్వా బార్బుడా పౌరసత్వం తీసుకన్న చోకీనస ఇటీవలే వేరేదేశం వెళ్లినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం బెల్జియం పౌరసత్వం తీసుకన్నాడని తన సతీమణి ప్రీతితో కలిసి ఆదేశంలో నివసిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు స్పష్టంచేసాయి. ఈక్రమంలోనే ఆయన్ను స్వదేశానికి రప్పించేందుకు బెల్జియం అధికారులను భారత్ సంప్రదిస్తోంది. సుమారు 13 వేలకోట్లకుపైగా మోసంచేసినట్లు 2018లో చోక్సీ, నీరవ్‌మోడీలపై అభియోగాలు నమోదయిన తర్వాత ఇద్దరూ కూడా దేశం వీడి పారిపోయారు. చోక్సీ ఆంటిగ్వా బార్బుడాకు పారిపోగా నీరవ్‌మోది బ్రిటన్‌జైలులో ఉన్నాడు. వీరిని భారత్‌కు రప్పించేందుకు భారత ప్రభుత్వం ఎడతెగని యత్నాలుచేస్తోంది. భారత్ పర్యటనకు వచ్చిన ఆంటిగ్వా బార్బుడా విదేశాంగమంత్రి ఈపీ ఛెత్‌గ్రీన్‌మాట్లాడుతూ మెహుల్‌చోక్సీ తమ దేశంలో లేరని, వైద్యంకోసం విదేశాలకు వెళ్లారని తెలిసిందన్నారు.

